గల్లీలో మాటలు.. ఢిల్లీకి మూటలు!

- రేవంత్‌కు తెలిసిన పాలన ఇదే
- భూములు అమ్మి పాలన చేస్తరా?
- 400 ఎకరాల భూమికి సర్కార్ టెండర్
- 30 వేల కోట్ల విలువైన భూములను అడ్డికిపావుశేరు చొప్పున అమ్మేయత్నం
- అప్పుచేయడమే పాలనగా మార్చుకున్న రేవంత్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

> 15 నెలల్లోనే రూ.లక్షా 65 వేల కోట్ల పైచిలుకు అప్పు చేశారు. తట్టెడు మట్టి తీసింది లేదు. ఒక్క పథకం అమలు చేసింది లేదు. కేసీఆర్ పాలనలో దేశానికే రోల్‌మాడల్‌గా నిలిచిన తెలంగాణ ప్రగతిని 15 నెలల్లోనే తిరోగమనం బాట పట్టించిన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.
> -కేటీఆర్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): గల్లీలో గాలిమాటలు.. ఢిల్లీకి ధనం మూటలు మోయడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీవిత లక్ష్యంగా పెట్టుకున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఎద్దేవా చేశారు. భూములు అమ్మితేకానీ ప్రభుత్వాన్ని నడపలేని దుస్థితికి తెలంగాణను తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నిధుల సమీకరణ కోసం తాజాగా హైదరాబాద్‌లోని రూ.30 వేల కోట్ల విలువైన భూములను అడ్డికిపావుశేరు చొప్పున అమ్మేందుకు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. బ్యాంకులో తనఖా పెట్టిన భూములనే వేలంవేసి అమ్ముకోవడం ప్రభుత్వ దివాలాకోరుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచగచ్చిబౌలి పరిధిలో ఉన్న 400 ఎకరాల భూములను అమ్మడం లేదని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి, ఊసరవెల్లి కంటే వేగంగా మాట మార్చారని మండిపడ్డారు. మాట తప్పి అసెంబ్లీని మోసం చేసిన రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి, క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. హైడ్రా, మూసీ కూల్చివేతల వంటి తలతోకలేని విధానాలతో రాష్ట్ర ఆదాయం తగ్గి, ప్రభుత్వ భూములను అమ్ముకుంటే తప్ప ఆదాయం సమకూర్చుకోలేని స్థాయికి రేవంత్ సర్కార్ దిగజారిందని దుయ్యబట్టారు.

స్వర్ణయుగం కేసీఆర్ పాలన

తమ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులతో ఎన్నో సంక్షేమ పథకాలు, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి రైతులు, పేదలను ఆదుకున్నామని కేటీఆర్ తెలిపారు. 70 లక్షల మంది రైతులకు రైతుబంధు కింద రూ.73 వేల కోట్లు, రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.6 వేల కోట్లతో రైతుబీమా, లక్ష 11 వేల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారాన్ని తమ ప్రభుత్వం అందజేసిందని వివరించారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామసాగర్ వంటి సాగునీటి ప్రాజెక్టులు, 45 వేల చెరువుల పునరుద్ధరణ, 45 లక్షల మందికి ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, వెయ్యికిపైగా గురుకుల పాఠశాలలు, 30 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణకు కేసీఆర్ పాలన స్వర్ణయుగమని పేర్కొన్నారు.

అప్పుచేయడమే పనిగా పెట్టుకున్న రేవంత్

బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందంటూ గతంలో అడ్డగోలుగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన మరుక్షణం నుంచి అప్పు చేయడమే పరమావధిగా పెట్టుకున్నారని కేటీఆర్ విమర్శించారు. 15 నెలల్లోనే రూ.లక్షా 65 వేల కోట్ల పైచిలుకు అప్పు చేశారని దుయ్యబట్టారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆ పైసలతో తెలంగాణ ప్రజలకు చేసిన ఒక్క మంచి పనినైనా చూపించాలని సవాల్ చేశారు. రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలను ఎగ్గొట్టి, విద్యుత్తు కోతలు విధించి, గురుకులాలను నిర్వీర్యం చేసి, కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పడావు పెట్టి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. అవగాహన రాహిత్యంతో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని కుప్పకూల్చి ఎనిమిది మంది ప్రాణాలను బలితీసుకున్న పాపం రేవంత్‌దేనని మండిపడ్డారు.

ఏటా 15% ఫీజులు పెంచుకోనివ్వండి

కార్పొరేట్లను వదిలి మాపై బ్రహ్మాస్త్రమా?

ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాల వినతి

ఫీజుల నియంత్రణ చట్టంపై విద్యాశాఖ చర్చలు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): బడా స్కూళ్లను వదిలిపెట్టి చిన్నా చితకా స్కూళ్లపై బ్రహ్మాస్త్రాలు గురిపెట్టవద్దని పలు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరాయి. ఫీజుల నియంత్రణ పేరుతో బడ్జెట్ స్కూళ్లను ఇబ్బందిపెట్టవద్దని పునరుద్ఘాటించాయి. ఫీజు నియంత్రణ చట్టం రూపకల్పనపై పాఠశాల విద్యాశాఖ బుధవారం సంప్రదింపులు జరిపింది. సైఫాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించింది. పలు సంఘాల ప్రతినిధులు తమ వాదనలు వినిపించారు. ఏటా 15శాతం ఫీజులు పెంచుకునే వెసులుబాటు కల్పించాలని కోరారు. ఫీజుల పెంపు 15శాతం మించితేనే ఫీజు రెగ్యులేటరీ కమిటీ ఆధీనంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రొఫెసర్ తిరుపతిరావు కమిటీ సిఫారసులు అమలుచేయాలని కోరారు. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల్లో ఫీజుల నియంత్రణపై దృష్టిపెట్టాలని పేర్కొన్నారు. ఫీజు రెగ్యులేటరీ కమిటీలను ఏర్పాటు చేస్తే ఫీజుల నియంత్రణ అదుపు తప్పి, అవినీతి పెరుగుతుందని ఓ పాఠశాల యజమాని తన వాదన వినిపించారు.

గ్రూప్ -1 పోస్టుల అమ్మకమంటూ ప్రచారం

పోలీసులకు ఫిర్యాదు చేసిన టీజీపీఎస్సీ

పరువునష్టం దావా వేస్తామంటూ ప్రకటన

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పోస్టులు అమ్మకమంటూ సోషల్‌మీడియాలో ప్రచారం జరగడంతో టీజీపీఎస్సీ స్పందించింది. తప్పుదోవ పట్టించే సమాచారాన్ని వ్యాప్తిచేసిన వారిపై బుధవారం బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. దీంతోపాటు సైబర్ క్రైమ్స్ డీసీపీకి సైతం లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. ఇక గ్రూప్-1పై సోషల్‌మీడియాలో వస్తున్న తప్పుడు వార్తలను కమిషన్ ఖండించింది. ఆశావాహుల్లో అశాంతిని సృష్టించేందుకు ప్రయత్నించిన వారిపై క్రిమినల్ పరువు నష్టం దావా వేయాలని నిర్ణయించినట్టు కమిషన్ ఇన్‌చార్జి కార్యదర్శి సుమతి తెలిపారు. గ్రూప్-1 ఫలితాలను పారదర్శకంగా, మెరిట్ ప్రకారం ప్రాసెస్ చేస్తున్నామని, తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని సూచించారు. ఏ అభ్యర్థికీ అన్యాయం జరగదని భరోసా ఇచ్చారు. త్వరలోనే అభ్యర్థి లాగిన్‌లో పేపర్ వారీగా మార్కులు, ప్రొవిజినల్ మార్కుల జాబితాను కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రచురిస్తామని వెల్లడించారు.

పట్టభద్రుల సీట్లో మట్టికరిచిన కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

విఫలమైన రేవంత్‌రెడ్డికి పట్టభద్రులు గట్టి సమాధానం చెప్పారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ నేతలు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 54 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని, 2 లక్షలకు పైగా ఉద్యోగ నియామకాలు చేపడతామని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో రాత పరీక్షలు నిర్వహించిన వాటికే నియామక పత్రాలు ఇచ్చి ఆ క్రెడిట్ కూడా తమదే అని రేవంత్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ స్థానం ఓడినా తమ ప్రభుత్వానికి వచ్చిన నష్టమేం లేదని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌పై ఉన్న వ్యతిరేకతను గుర్తించినందువల్లే నైరాశ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారని, ఇప్పుడు అదే నిజమైందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. తమ అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన నాయకుడే ఓడినా పర్వాలేదనడంతో ఎన్నికల ముందే ఓటమిని ఒప్పుకున్నారని చర్చ నడుస్తున్నది.

రేవంత్ పాలనకు రెఫరెండం

ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి మరికొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఉద్యోగాల నియామకాలకు సంబంధించి కొన్ని లెక్కలు చెప్పారు. తాను చెప్పింది అబద్ధమైతే ఓటు వేయొద్దని, నిజమని నమ్మితేనే కాంగ్రెస్ అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. రేవంత్‌రెడ్డి చెప్పిన లెక్కలు చూసి చాలామంది పట్టభద్రులే ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి మరీ ఇంతలా అబద్ధాలు చెప్పడమేంటని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. అదే ఆగ్రహాన్ని ఓటింగ్‌లో చూపించారని విశ్లేషకులు చెప్తున్నారు. అధికారంలోకి వచ్చిన 12 నెలల్లో బీసీ కులగణన పూర్తి చేశామని సీఎం చెప్పినా.. బీసీలెవరూ కాంగ్రెస్‌ను నమ్మలేదని ఈ ఫలితాలు రుజువు చేస్తున్నాయని బీసీ సంఘాల నాయకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ సొంత జిల్లా నిజామాబాద్‌లో ఆయన ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారని ఫలితాల సరళిని బట్టి తేలిపోయిందని చెప్తున్నారు. అధికారంలో ఉండి కూడా మూడు ఎమ్మెల్సీ స్థానాలను కాంగ్రెస్ ఓడిపోవడం ఆ పార్టీ పాలనా వైఫల్యానికి రెఫరెండంలా భావించాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా అంజిరెడ్డి విజయం

- రెండో ప్రాధాన్య ఓట్లతో గెలుపు

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 5: కరీంనగర్-ఆదిలాబాద్-నిజామాబాద్-మెదక్ పట్టభద్రుల నియోజకవర్గపు ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి విజయం సాధించారు. రెండో ప్రాధాన్య ఓట్లతో ఆయన గెలుపొందారు. రెండు రోజుల పాటు జరిగిన కౌంటింగ్ ప్రక్రియ అడుగడుగునా ఉత్కంఠ రేపింది. బీజేపీ-కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య 'నువ్వానేనా' అన్నట్టుగా గెలుపు దోబూచులాడింది. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పట్టభద్రుల స్థానానికి మొత్తం 2,52,029 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 28,686 ఓట్లు చెల్లలేదు. వీటిలో 75,675 బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి, 70,565 కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి, 60,419 ఓట్లు బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు వచ్చాయి. నిబంధనల ప్రకారం మొదటి ప్రాధాన్యతలోనే 1,11,672 ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించాలి. కానీ మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థికి కూడా అన్ని ఓట్లు రాలేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్లు లెక్కించారు. మొత్తం 56 మంది పోటీచేయగా, రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కించేందుకు గాను 54 మందిని ఎలిమినేట్ చేస్తూ వచ్చారు. చివరకు బీజేపీ అభ్యర్థికే అత్యధిక ఓట్లు వచ్చాయి. గెలుపు కోటాకు అవసరమైన ఓట్లు రాకపోయినా 5వేల పైచిలుకు ఓట్ల ఆధిక్యం ఉండడంతో మూడో ప్రాధాన్యానికి వెళ్లకుండా అంజిరెడ్డి గెలిచినట్టు అధికారులు ప్రకటించారు. కాగా, గెలుపుపై ఎంతో ధీమాతో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, ఊహించిన దానికి భిన్నంగా ఫలితం వెలువడడంతో భావోద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

లెక్కింపు కేంద్రం నుంచి కంటనీరు పెడుతూ వెళ్లిపోతున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

ఎల్ఆర్ఎస్‌లో ఓపెన్ లూటీ!

మొదటిపేజీ తరువాయి...

ధ్రువీకరించడం లేదని అధికారులు చెప్తున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్‌లో నిబంధనల ప్రకారం దక్కాల్సిన వేల రూపాయల మినహాయింపునకు సామాన్యుడు నోచుకోవడం లేదు. ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిధిలోనే కోట్ల రూపాయల 'ప్రో-రేటా' రూపంలో దక్కాల్సిన ఆర్థిక ప్రయోజనం అందడం లేదు.

ఒక లేఅవుట్ చేసినపుడు హెచ్ఎండీఏ, డీటీసీపీ అనుమతులు తీసుకునే క్రమంలో ఆయా సంస్థలు నిబంధనల ప్రకారం పది శాతం విస్తీర్ణాన్ని ప్రజా ప్రయోజనాలకు కేటాయిస్తారు. అందులో పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, క్రీడా మైదానాలు, జిమ్‌లు ఇలా కాలనీవాసుల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకుంటారు. కానీ దశాబ్దాల కిందట చేసిన అనధికారిక లేఅవుట్లలో రహదారులు మినహా ఇలాంటి అవసరాల కోసం కేటాయించిన స్థలాలు నామమాత్రమే. ఇవన్నీ గ్రామపంచాయతీ అనుమతులతో చేసిన అనధికారిక లేఅవుట్లు కావడంతోనే ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ కింద వాటిని క్రమబద్ధీకరిస్తున్నది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మార్చి 31లోగా రూ.3వేల కోట్ల ఆదాయమే లక్ష్యంగా యుద్ధప్రాతిపదికన ఎల్ఆర్ఎస్ ప్రక్రియను 25 శాతం రిబేటును ప్రకటించి చేపట్టింది. ఇటీవల ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాల్లో ఓపెన్ స్పేస్ చార్జీలను ప్రో-రేటా విధానంలో చెల్లించాలనే అంశాన్ని చేర్చింది. కానీ ఇది అమలుకు నోచుకోవడంలేదని దరఖాస్తుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇది నిబంధన...

లేఅవుట్ చేసినపుడు మొత్తం విస్తీర్ణంలో పది శాతం స్థలాన్ని ప్రజా ప్రయోజనాలకు కేటాయించాలి. ఇది సర్కారు నిబంధన. ఇది అమలు చేయనందునే ప్రభుత్వం వాటిని అనధికారిక లేఅవుట్ల కింద పరిగణిస్తూ అందులోని ప్లాట్లకు ఎల్ఆర్ఎస్ (భూ క్రమబద్ధీకరణ పథకం)ను అమలు చేస్తుంది. లేఅవుట్ యజమాని పది శాతం విస్తీర్ణాన్ని వదిలిపెట్టనందుకు అక్కడి మార్కెట్ విలువలో 14 శాతం మొత్తాన్ని ప్లాటు యజమానుల నుంచి వసూలు చేస్తుంది.

వాస్తవానికి భిన్నంగా ఛార్జీల వసూలు...

ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో ఎక్కడా ఈ ప్రో-రేటా విధానాన్ని అమలు చేయడం లేదు. దరఖాస్తుదారుల కాలనీలో ఇప్పటికే వినియోగంలో ఉన్న ప్రజాప్రయోజనాల స్థలాల విస్తీర్ణాన్ని పరిగణనలోకి తీసుకోవడం లేదు. అది అనధికారిక లేఅవుట్ అయినందున కచ్చితంగా 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించాలంటున్నారు. ఎవరైనా తమ కాలనీలో పార్కుగానీ దేవాలయాలకు కేటాయించిన స్థలాలుగానీ కమ్యూనిటీ హాల్ నిర్మించిన ప్రదేశంగానీ ఉందని చెప్పినా వాటిని తాము ధ్రువీకరించలేమని సంబంధిత మున్సిపాలిటి, కార్పొరేషన్ అధికారులు చెప్తున్నారు. తద్వారా ప్రభుత్వమే ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం సామాన్యుడు ప్రయోజనం పొందలేకపోతున్నాడు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ కింద 25.60 లక్షల దరఖాస్తులు వచ్చాయి. ప్రభుత్వం ఈ ప్రో-రేటా విధానాన్ని కచ్చితంగా అమలు చేస్తే ప్రజలకు కోట్ల రూపాయల భారం తగ్గనుంది. ముఖ్యంగా ఒక రియల్టర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు అందులో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రతీ సామాన్యుడిపై ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రూపంలో ఆర్థిక భారాన్ని మోపుతున్నది. రియల్టర్ మాత్రం అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కనీసం ఈ ప్రో-రేటా విధానాన్నయినా ప్రభుత్వం సక్రమంగా అమలు చేస్తే సామాన్యులకు ఎంతోకొంత న్యాయం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

సాధారణంగా ఉండే పరిస్థితులు ఇవి...

నగరంతో పాటు శివారులోని అన్ని అనధికారిక లేఅవుట్లలో పార్కులు, ఓపెన్ స్పేస్‌లు, దేవాలయాలు, కమ్యూనిటీ హాళ్లు... ఇలా ఎన్నో ప్రజాప్రయోజనకర ప్రదేశాలు ఉన్నాయి. ఇవే కాదు.. ఓ కాలనీలో వెయ్యి గజాల పార్కు స్థలాన్ని కాపాడాం.. మరో కాలనీలో 500 గజాల్లో ఆక్రమణకు గురైన ఓపెన్ స్పేస్‌ను స్వాధీనం చేసుకున్నాం.. అంటూ తరచూ అధికారులు ప్రకటనలు విడుదల చేస్తారు. వాటిని పరిగణలోకి తీసుకొని, అవి ఎంత విస్తీర్ణంలో ఉన్నాయో కొలిచి, ఎల్ఆర్ఎస్ కోసం వసూలు చేస్తున్న 14 శాతం చార్జీల్లో మినహాయిస్తుందా? అని సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రో-రేటా లెక్క ఇది

ఉదాహరణకు పదెకరాల విస్తీర్ణంలో గ్రామ పంచాయతీ అనుమతి తీసుకొని గతంలో లేఅవుట్ చేశారు. నిబంధనల ప్రకారం పది శాతం అంటే ఎకరం (4,840 చదరపు గజాలు) విస్తీర్ణాన్ని ప్రజా ప్రయోజనాలకు వదిలివేయాలి. ఇలా కాకుండా ఒకట్రెండు చోట్ల పార్కుల కోసం 600 చదరపు గజాల చొప్పున స్థలాలను వదిలివేశారనుకుందాం. అంటే 1200 చదరపు గజాల్లో మాత్రమే ఓపెన్ స్పేస్ వదిలివేశారు. నిబంధనలు పది శాతం అని చెబుతుంటే.. ఇక్కడ మాత్రం కేవలం 2.5 శాతం విస్తీర్ణంలో మాత్రమే వదిలిపెట్టారు. ఈ 1200 చదరపు గజాలను మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు స్వాధీనం చేసుకొని కాలనీవాసుల కోసం వాటిని అభివృద్ధి చేస్తున్నాయి. మరి ఈ లెక్కన..

- **ఆ లేఅవుట్‌లో ఒక వ్యక్తి తనకు ఉన్న 200 చదరపు గజాల ప్లాటును ఎల్ఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించేందుకు దరఖాస్తు చేసుకున్నారు.**
- **స్టాంపు, రిజిస్ట్రేషన్ శాఖ రికార్డుల ప్రకారం అక్కడ చదరపు గజం విలువ రూ.10 వేలు ఉందనుకుంటే.. ఎల్ఆర్ఎస్ కింద 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలను చెల్లించాలి.. అంటే 200 చదరపు గజాల ప్లాటు విలువ ప్రభుత్వపరంగా రూ.20 లక్షలు. ఇందులో 14 శాతం అంటే రూ.2.80 లక్షలు చెల్లించాలి.**
- **ఎలాగూ ఆ లేఅవుట్‌లో 1200 చదరపు గజాల్లో రెండు పార్కులు ఉన్నందున వాటిని పరిగణలోనికి తీసుకుంటే పది శాతంలో 2.5 శాతం ఉన్నందున రూ.70 వేలు మినహాయించాలి. దరఖాస్తుదారుడి నుంచి ప్రో-రేటా విధానం ప్రకారం రూ.2.10 లక్షలు మాత్రమే ఓపెన్‌స్పేస్ చార్జీల కింద వసూలు చేయాలి.**

కడ్తాల్ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న పాడి రైతులు, బీఆర్ఎస్ నాయకులు

పాడి పశువులతో 'చలో ప్రజాభవన్'

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పాడిరైతుల నిరసన

- హైవేపై పాదయాత్రగా బయలుదేరిన నేతలు
- 80రోజుల బకాయిలు చెల్లించాలని డిమాండ్
- అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

కడ్తాల్, మార్చి 5: పాల బిల్లుల కోసం పాడి రైతులు వినూత్న నిరసనకు దిగారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పాడిపశువులు సహా పాదయాత్రగా హైవేపై బయలుదేరి వెళ్తుండగా, పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైకి పశువులను తీసుకొచ్చిన పాడి రైతులు, బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్ దారిపట్టారు. 80 రోజుల పాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈలోగా స్థానిక పోలీసులు వారిని అడ్డుకొని, అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్‌నాయక్ తదితరులు మాట్లాడారు. విజయ డెయిరీ సంస్థ పాడి రైతులకు 80 రోజులుగా బిల్లులు చెల్లించకపోవడంతో పాడి రైతులకు పశుపోషణ భారమైందని ఆవేదన వ్యక్తంచేశారు. రోజువారీ ఇంటి ఖర్చులు, పిల్లల ఫీజులకు అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని తెలిపారు. కడ్తాల్ పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోనే సుమారు రూ.20 కోట్ల వరకు పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పాల బిల్లులను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో అసెంబ్లీతోపాటు మంత్రుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రామకృష్ణ, రాజేందర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేశ్, పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, మాజీ సర్పంచులు కృష్ణయ్యయాదవ్, తులసీరాంనాయక్, హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీలు గోపాల్, రమేశ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, రామచంద్రయ్య, మహేశ్, జగన్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, పవన్, మల్లేశ్, నాగార్జున్, రాములుయాదవ్, రవి, రమేశ్, జగన్, రాజు, పకీరా, అంజి, బాబా, అమ్జాద్, రవి, శ్రీను, కుమార్, శ్రీకాంత్, చందర్, సాయికుమార్, పవన్‌కల్యాణ్ పాల్గొన్నారు.

తెలంగాణ నుంచి మరో కంపెనీ ఔట్

మొదటిపేజీ తరువాయి...

నష్టపోయినట్టు చెప్పవచ్చు. బీఆర్ఎస్ హయాంలో ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ మహేశ్వరంలోని ఈ-సిటీలో రూ.483 కోట్ల పెట్టుబడితో అత్యాధునిక సోలార్ సెల్స్, సోలార్ మాడ్యూల్స్ తయారీ పరిశ్రమను ఏర్పాటుచేసింది. అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కే తారకరామారావు జూలై 2021లో దీన్ని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్‌లో 4 గిగావాట్ల సెల్స్, 4 గిగావాట్ల మాడ్యూల్స్ తయారుచేసే ఫొటో వోల్టాయిక్(పీవీ) సంస్థను ఏర్పాటుచేయనున్నట్టు ఆ సంస్థ గత ఏడాది ప్రకటించింది. అనుమతుల కోసం పరిశ్రమల శాఖకు దరఖాస్తు కూడా చేసుకున్నది. ఇంతలోనే ఏమైందో ఏమో ఇప్పుడు ఏపీలో రూ.1700కోట్లు పెట్టుబడి పెడుతున్నామని, దీంతో 2000మందికి ఉద్యోగాలు లభిస్తాయని తాజాగా స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. తమ వ్యాపార వ్యూహంలో భాగంగా తెలంగాణలో ప్రతిపాదిత పెట్టుబడిని ఏపీకి మార్చుకున్నట్టు బాంబే, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వివరించింది. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ(ఏపీఐఐసీ) నెల్లూరు జిల్లా నాయుడుపేటలో 269.71ఎకరాల భూమిని ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థకు కేటాయించింది. ఈ సైట్‌లో 4గిగావాట్ల సోలార్ సెల్ టాప్‌కాన్, 5గిగావాట్ల సిలికాన్ ఇంగోట్, వేఫర్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైన తరువాత సంస్థ తమ పెట్టుబడి వ్యూహాన్ని మార్చుకున్నట్టు స్పష్టంగా అర్థమవుతున్నది.

పెట్టుబడి పర్యావరణ వ్యవస్థకు విఘాతం....

ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ఏపీకి తరలివెళ్లడం తెలంగాణకు గట్టి ఎదురుదెబ్బగా పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కార్నింగ్ ఇంటర్నేషనల్ కార్పొరేషన్ తమిళనాడుకు వెళ్లగా, కేన్స్ సెమికాన్ గుజరాత్‌కు మారింది. ఇలా ప్రఖ్యాత కంపెనీలు రాష్ట్రాన్ని వీడటం పరిశ్రమ వర్గాల్లో ప్రభుత్వంపట్ల తగ్గుతున్న విశ్వాసానికి సంకేతంగా వారు చెప్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పిన పెట్టుబడి అనుకూల పర్యావరణ వ్యవస్థను కొనసాగించడంలో కాంగ్రెస్ సర్కారు విఫలమవుతున్నదని వారు అభిప్రాయపడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పారిశ్రామికరంగం మరింత క్షీణించే అవకాశముందని ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన పారిశ్రామిక అనుకూల, స్నేహపూర్వక విధానాలతోనే తాము తెలంగాణలో పెట్టుబడి పెడుతున్నట్టు ప్రీమియర్ ఎనర్జీస్ సంస్థ ప్రతినిధులు ఈ-సిటీలో సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించిన సందర్భంగా వెల్లడించడం గమనార్హం. కాగా, ఏపీలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైనప్పటినుంచి పెట్టుబడులు ఆకర్షించేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నది. ఇందులో భాగంగా టెస్లా కంపెనీని కూడా తమ రాష్ట్రానికి ఆహ్వానించేందుకు తెరవెనుక కసరత్తు చేస్తున్నట్టు పరిశ్రమ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. దీన్నిబట్టి ప్రీమియర్ ఎనర్జీస్ బాటలోనే మరికొన్ని కంపెనీలు తరలిపోయే అవకాశం లేకపోలేదని అంటున్నాయి.

లోకం పోకడ


అ- అర్థాకలి
ఆ- ఆవేదన
ఇ- ఇల్లగడువకమీక్షం
ఈ- ఈపడింపులు వద్దు
ఉ- ఉపేక్షిస్తున్న